

## బురదలో బడికెళ్లేదెట్లా ?

ఎడతెరిపిలేని వర్షాలకు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మచ్చాపూర్ రోడ్డు బురదగా మారింది. బుధవారం మచ్చాపూర్ విద్యార్థులను ముత్నూర్ గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలకు తరలిస్తున్న ఆటో ఆ బురదలో దిగబడింది. దీంతో విద్యార్థులు కిందికి దిగి బురదలో దిగబడిన ఆటోను బయటకు నెట్టారు. అనంతరం ఆటోలో బడికి వెళ్లారు. బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. –ఇంద్రవెల్లి



## గొడుగుల కింద చదువులు

మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 54 మంది విద్యార్థులు ఉన్నారు. రెండు తరగతి గదులు చిన్నపాటి వర్షానికే కురుస్తుండగా.. విద్యార్థులు ఇంటి నుంచి గొడుగులు తెచ్చుకొని చదువుకుంటున్నారు. భారీ వర్షం పడితే పుస్తకాలు, బ్యాగ్‌లు తడిసి ముద్దవుతున్నాయి. గదుల్లో నీరు నిలుస్తుండటంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారని హెచ్ఎం ఇంద్రసింగ్ తెలిపారు. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. –నెన్నెల

## 'అంగన్‌వాడీ కోడిగుడ్డు'లో పురుగులు



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బంజారాహిల్స్ అంగన్‌వాడీ కేంద్రంలో 4రోజుల క్రితం అంగన్‌వాడీ టీచర్ శ్రీలత కోడిగుడ్లను పంపిణీ చేసింది. భూక్య అభినాయక్‌కు చెందిన చిన్నారులకు ఇచ్చిన కోడిగుడ్లను బుధవారం ఉడకబెట్టి పెంకు తీయగా అందులో పురుగులు కనిపించాయి. –భువనగిరి అర్బన్

# బీఆర్ఎస్ స్థలంలో నిర్మాణాల నిలిపివేతకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా కోకాపేటలోని 230, 240 సర్వే నంబర్లలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి కేటాయించిన 11 ఎకరాల భూమిలో నిర్మాణాలు చేపట్టకుండా ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఆ భూమిలో బీఆర్ఎస్ ఏమైనా నిర్మాణాలను చేపట్టినట్టయితే తమ దృష్టికి తీసుకురావచ్చని పిటిషనర్లకు సూచించింది. ఆ భూమి తమకు వారసత్వంగా వచ్చిందని, దాన్ని బీఆర్ఎస్‌కు కేటాయించడం చెల్లదని పేర్కొంటూ కొందరు ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ జరిపారు. ఈ వ్యాజ్యాలపై కౌంటర్ దాఖలు చేయాలని బీఆర్ఎస్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం కూడా వివరణ ఇవ్వాలని కోరుతూ.. తదుపరి విచారణను ఆగస్టు 2కు వాయిదా వేశారు.



# హనుమకొండలో బీఆర్ఎస్‌కు స్థలం కేటాయింపుపై 30న తీర్పు

**హైకోర్టు ప్రకటన**

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): హనుమకొండలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యాలయ నిర్మాణం కోసం ఎకరం స్థలాన్ని కేటాయించిన వ్యవహారంపై ఈ నెల 30న తీర్పు వెలువరిస్తామని హైకోర్టు ప్రకటించింది. ఆ స్థలంలో నిర్మాణాలను చేపట్టడంపై గత నెల 25న మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జారీచేసిన నోటీసులను సవాలు చేస్తూ హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు డీ వినయ్ భాస్కర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ జరిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ.. బీఆర్ఎస్‌కు కేటాయించిన స్థలంలో కాకుండా మరో స్థలంలో నిర్మాణాలు చేపట్టినట్టు చెప్పారు. ఆ భూమికి ప్రత్యామ్నాయంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఇంటికి సమీపంలో మరో స్థలాన్ని కేటాయించాలని బీఆర్ఎస్ కోరిందని, దీనిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకముందే ఆ పార్టీ నిర్మాణాలను చేపట్టిందని వివరించారు. వాస్తవానికి హనుమకొండలో బీఆర్ఎస్‌కు కేటాయించిన స్థలం కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కుడా) పరిధిలో ఉన్నదని తెలిపారు. దీంతో ఆ స్థలంలోని నిర్మాణాల ఫొటోలను పరిశీలించిన న్యాయమూర్తి.. ఈ నెల 30న తీర్పును వెలువరిస్తామని స్పష్టం చేశారు.

# రైతులకు గాయత్రిషుగర్స్ క్షమాపణలు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- కేవైసీ అప్‌డేట్‌తోనే ఇలా జరిగింది
- ఇరవై ఏండ్లుగా బ్యాంకు రుణాలు తీసుకుంటున్నాం
- రుణమాఫీ డబ్బులను తిరిగి రైతులకే చెల్లిస్తాం
- మీడియాతో ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్

నమస్తే ఎఫెక్ట్

నిజామాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): చెరుకు రైతులకు తెలియకుండా వారి పేరిట రుణాలు తీసుకున్న గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం అన్నదాతలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పింది. బైబ్యాక్ ఒప్పందాల ముసుగులో రైతుల సమ్మతి లేకుండానే వారి పేరిట బ్యాంకు రుణాలు తీసుకున్న వైనాన్ని 'నమస్తే తెలంగాణ' బుధవారం వెలుగులోకి తెచ్చిన నేపథ్యంలో ఆ సంస్థ దిగొచ్చింది. రైతుల పేరిట తీసుకున్న రుణాలను పది రోజుల్లోపు బ్యాంకులకు చెల్లిస్తామని వెల్లడించింది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని ఫ్యాక్టరీలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. 20 ఏండ్లుగా ఇలా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నామని, ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ తలెత్తలేదని చెప్పారు. బైబ్యాక్ ఒప్పందంలో భాగంగానే యాజమాన్యం బ్యాంకులతోనూ రుణాల కోసం ఒప్పందం చేసుకుంటుందని, ఇదంతా పారదర్శకంగా చేపట్టినట్టు తెలిపారు. పది రోజుల్లోనే బ్యాంకులకు చెల్లింపులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కేవైసీ అప్‌డేట్ కావడం వల్లే ఇదంతా జరిగిందంటూ పారదర్శక వ్యవస్థపైనే నిందలు వేసేందుకు ఆయన ప్రయత్నించడం గమనార్హం.

> **విచారణకు కమిటీని ఏర్పాటు చేశాం**
>
> 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన కథనం ఆధారంగా గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో అనర్హులకు రుణమాఫీ అంశంపై విచారణకు ఆదేశాలు జారీ చేశాం. ఆర్డీవో, జిల్లా వ్యవసాయాధికారులకు ఈ బాధ్యతలను అప్పగించాం. రెండు రోజుల్లోనే విచారణ నివేదిక వస్తుంది. ఆ తర్వాత అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడిస్తాం.
>
> **- ఆశీశ్ సంగ్వాన్, కామారెడ్డి జిల్లా కలెక్టర్**

**కదిలించిన 'నమస్తే తెలంగాణ' కథనం**

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లోని దాదాపు 10 మండలాల్లో చెరుకు సాగు చేస్తుంటారు. ఆయా గ్రామాల్లో చెరుకు సాగు చేసే రైతులతో గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ ఒప్పందాలు చేసుకుంటుంది. ఫ్యాక్టరీకి చెందిన బాధ్యులు సదరు రైతులతో పలు డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకుంటారు. అయితే, చెరుకు సాగుకు తప్ప రుణాల విషయంలో రైతులెవ్వరూ ఫ్యాక్టరీకి ఎలాంటి ఒప్పందాలను రాసివ్వరు. కానీ, ఇదే అదునుగా భావించి ఫ్యాక్టరీ నిర్వాహకులు రూ.కోట్లలో రుణాలను సేకరిస్తుండటం తాజాగా బయటపడింది. ఇందులో రుణమాఫీ పరిధిలోని రుణాలు కూడా ఉండటంతో రైతులంతా లబోదిబోమనగా వారికి 'నమస్తే తెలంగాణ' అండగా నిలిచింది. రైతులతో మాట్లాడి వారి వేదనకు అక్షర రూపం ఇచ్చింది. 'రైతు చేయని రుణాలూ మాఫీ', 'ఒప్పందాల పేరిట దారుణం' శీర్షికలతో బుధవారం ప్రచురించిన ప్రత్యేక కథనాలు జిల్లాలో కలకలం రేపాయి. వీటిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం వివరాలను ఆరా తీసింది. సంబంధీకులపై సీరియస్ కావడంతో గాయత్రి షుగర్స్ యాజమాన్యం దిగొచ్చింది.

**ట్రైపార్టీ అగ్రిమెంట్‌తో బురిడీ**

గాయత్రి షుగర్ ఫ్యాక్టరీస్, రైతులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య ట్రైపార్టీ అగ్రిమెంట్ 20 ఏండ్లుగా కొనసాగుతున్నది. ఇందులో రైతుల పాత్ర సూక్ష్మమే. పత్రాలపై సంతకాలతోనే సరిపెడతారు. కానీ, బ్యాంకు, షుగర్ ఫ్యాక్టరీ మధ్య ఒప్పందం అధికారికంగా జరుగుతుంది. ఈ విషయం సగానికంటే ఎక్కువ మంది రైతులకు తెలియదు. సంతకాలు పెట్టి బైబ్యాక్ ఒప్పందాలు చేసుకోవడం మినహా ఇందులో బ్యాంకర్లు, షుగర్ ఫ్యాక్టరీ పాత్రపై ఎలాంటి అవగాహన రైతులకు లేదు. ట్రైపార్టీ అగ్రిమెంట్ ఆధారంగా చేసుకుని యూనియన్ బ్యాంకు నుంచి రుణాలను ఫ్యాక్టరీ స్వీకరించింది. ఇందులో ఫ్యాక్టరీ ఆస్తులను పూచీకత్తుగా యూనియన్ బ్యాంకు పరిగణనలోకి తీసుకున్నది. ట్రైపార్టీ కింద మంజూరైన రుణాలకు వాస్తవానికి రుణమాఫీ వర్తించదు. సర్కారు జారీచేసిన మార్గదర్శకాల్లోనూ ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. కానీ, బ్యాంకులు, వ్యవసాయాధికారులు మాత్రం రుణమాఫీ కింద వీటిని పరిగణించడంలో దాగి ఉన్న మర్మం ఏమిటో ఎవరికీ అంతుచిక్కడం లేదు.

### పెదవి విప్పని ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రైతులకు జరిగిన ఈ ధోకాపై కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కనీసం పెదవి విప్పలేదు. అసెంబ్లీ సమావేశాల నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ తన సొంత నియోజకవర్గంలో జరిగిన తంతుపై స్పందించకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఖమ్మం | 32.0°c | 24.0°c |
| హైదరాబాద్ | 26.6°c | 23.6°c |
| ఆదిలాబాద్ | 29.2°c | 23.9°c |
| వరంగల్ | 26.0°c | 23.0°c |
| నల్లగొండ | 30.0°c | 22.0°c |
| కరీంనగర్ | 28.0°c | 24.0°c |
| నిజామాబాద్ | 28.8°c | 23.4°c |
| రంగారెడ్డి | 28.9°c | 21.6°c |
| మహబూబ్‌నగర్ | 28.0°c | 22.7°c |
| మెదక్ | 27.9°c | 22.3°c |

## మరో రెండు రోజులు వానలు

- హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి



హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, హన్మకొండ, ములుగు, కామారెడ్డి, సంగారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, జనగామ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీచేశారు. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా జూలై సాధారణ వర్షపాతం 229.1 మి.మీ ఉండగా, ఇప్పటి వరకు 238.9 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో అత్యధికంగా 10.02 సెం.మీ, ఆదిలాబాద్‌అర్బన్‌లో 6.46 సెం.మీ,ఇంద్రవెల్లిలో 4.56 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.

# ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలి

- ఢిల్లీలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ ధర్నా
- దాడులు, హింసాత్మక ఘటనలపై ఆగ్రహం
- ఎస్పీ, ఏఐఏడీఎంకే, శివసేన (ఉద్ధవ్) పార్టీల మద్దతు
- కేంద్ర హోంశాఖ విచారణకు డిమాండ్




ఢిల్లీలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేస్తున్న దీక్షకు మద్దతు తెలుపుతున్న ఎస్పీ అధినేత అఖిలేశ్‌యాదవ్

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో దాడులు, హింసాత్మక ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న హింసాత్మక ఘటనలపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆందోళన చేపట్టారు. ఈ ధర్నాకు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్, ఆ పార్టీ ఎంపీలు రాంగోపాల్‌యాదవ్, ప్రియాంక చతుర్వేది, శివసేన (ఉద్ధవ్ వర్గం) లోక్‌సభ ఫ్లోర్‌లీడర్ రాహుల్ షేవాలే, ఎంపీ సంజయ్‌రౌత్, ఏఐఏడీఎంకే ఎంపీ తంబిదురై తదితరులు స్వయంగా పాల్గొని మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం విపక్ష పార్టీ నేతలపై దాడులు చేస్తున్నదని మండిపడ్డారు. దాడులకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ఆదేశాలిచ్చారని ఆరోపించారు. 45 రోజుల్లోనే 35 రాజకీయ హత్యలు జరిగాయని,వందల ఇండ్లను ధ్వంసం చేశారని చెప్పారు. అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉన్నదా ? అని ప్రశ్నించారు.

**యూపీలోనూ ఇదే పరిస్థితి : అఖిలేశ్ యాదవ్**

ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో ఆందోళనకరమైన పరిస్థితులున్నాయని ఎస్పీ అధినేత అఖిలేశ్‌యాదవ్ చెప్పారు. ప్రతీకార రాజకీయాలు మంచిదికాదని హితవు చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణ విషయంలో జగన్‌కు మద్దతిస్తామని స్పష్టంచేశారు. సంజయ్ రౌత్ మాట్లాడుతూ.. ఏపీలో జరిగిన దాడులపై కేంద్ర హోంశాఖ ప్రత్యేక బృందాన్ని రాష్ట్రానికి పంపాలని డిమాండ్ చేశారు. రాహుల్ షేవాలే మాట్లాడుతూ.. ఏపీలో పరిస్థితి అత్యంత విచారకరమని, మణిపూర్ లాంటి పరిస్థితులు ఉన్నాయని, కేంద్ర హోంశాఖ చూస్తూ ఊరుకోవద్దని కోరారు. తంబిదురై మాట్లాడుతూ.. రాజకీయ దాడులు మంచిది కాదని హితవు చెప్పారు. తమిళనాడులోనూ ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నామని, దాదాపు 590 మందిని హత్య చేశారని ఆవేదన వ్యక్తంచేశారు.

# రుణమాఫీ చెప్పిందెంత? చేసిందెంత?

- రైతుభరోసా రైతులకు ఇప్పటికీ లేకపాయే
- రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫైర్



పెద్దవంగర, జూలై 24: గత డిసెంబర్ 9న చేయాల్సిన రూ.2 లక్షల రుణమాఫీని ఏడు నెలలు ఆలస్యం చేసి.. రూ.31 వేల కోట్ల మాఫీ అని గొప్పలు చెప్పి.. తీరా రూ.6 వేల కోట్లు విదిల్చి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు వానకాలం సీజన్‌లో ఎకరానికి రూ.7500 చొప్పున రైతు భరోసా కింద ఇవ్వాల్సిన రూ.11,250 కోట్లు ఎగ్గొట్టి.. ఆ డబ్బుల్లోంచి రుణమాఫీ కింద రూ.6,098 కోట్లు విదిల్చి ఏదో ఘన కార్యం చేసినట్టు ప్రచారం చేసుకుంటున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పరిస్థితి కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉందని ఎద్దేవా చేశారు. రైతుల రుణమాఫీపై కాంగ్రెస్ చెప్పిందెంత? రేవంత్‌రెడ్డి సర్కార్ ఇస్తున్నదెంత? అని ప్రశ్నించారు. కేసీఆర్ ఏమీ చేయలేదని, అంతా తామే చేస్తున్నామనే భ్రమల నుంచి కాంగ్రెస్ సర్కారు బయటకు రావాలని సూచించారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోళ్లు, రెండు విడుతల్లో రూ.28 వేల కోట్ల రుణమాఫీ, మిషన్ కాకతీయ వంటి అనేక పథకాలు అమలు చేసి ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాల ప్రశంసలు పొందారని గుర్తుచేశారు. జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా జూలై వచ్చినా రైతు ఖాతాలో వేయలేదని, కౌలు రైతులకు ఇస్తామన్న రూ.15 వేలు ఇయ్యలేదని, రైతు కూలీలకు రూ.12 వేల హామీ ఇంకా అమలు చేయలేదని విమర్శించారు.

## ఇంకెంత కాలం మభ్యపెడతరు?

**ఎస్సీ వర్గీకరణపై కేంద్రాన్ని నిలదీసిన వంగపల్లి**



హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణపై రేపు మాపు అంటూ పదేండ్లు కాలం గడిపి ఇంకా పార్లమెంటులో బిల్లు పెట్టకుండా ఇంకెంత కాలం మభ్యపెడతారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. హైదరాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి, ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన బీజేపీ నేతలు అధికారంలోకి వచ్చి 11 ఏండ్లు అవుతున్నా ఆ అంశాన్ని ప్రస్తావించడమే లేదని మండిపడ్డారు. నిన్నటి కేంద్ర బడ్జెట్‌లో కూడా తెలంగాణకు మొండి చేయి చూపారని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకపోతే బీజేపీ నేతలతోపాటు మాదిగ సామాజికవర్గంలోని ఇంటి దొంగలను బట్టలిప్పి బజారున నిలబెడతామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై తాడో పేడో తేల్చుకోవడానికి ఆగస్టు 6న ఢిల్లీలో దీక్ష చేయనున్నట్టు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోరుకునే సంస్థలు, సంఘాలు, మద్దతు ఇచ్చే పార్టీలు తమ దీక్షకు సంఘీభావం తెలుపాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేత యాతాకుల భాస్కర్ మాదిగ, కోర్ కమిటీ సభ్యులు చిలకమరి గణేశ్, పొట్టపెంజర రమేశ్, బంగారు శ్రీనివాస్, డప్పు శివరాజ్, నకిరేకంటి అంజన్న, కొండ లక్ష్మమ్మ, ఈదునురి యాకయ్య, కొల్లూరి వెంకట్, వరిగడ్డి చందు, కే అంజన్న, ధర్మరపు శ్రీకాంత్, ఎల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థికి పాముకాటు

**రిమ్స్‌లో చికిత్స.. హైదరాబాద్‌కు తరలింపు**

ఎదులాపురం, జూలై 24: ఆదిలాబాద్ ఎస్టీ గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న జాదవ్ సిద్ధు పాముకాటుకు గురయ్యాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న జాదవ్ సిద్ధు ఈ నెల 22న రాత్రి వసతి గృహంలో కింద పడుకున్నాడు. రాత్రి సమయంలో పాము కాటు వేసింది. ఈ విషయం నిద్రలో ఉన్న విద్యార్థికి తెలియదు. 23న ఉదయం తోటి మిత్రులు నిద్ర లేపగా.. సిద్ధు కండ్లలో నుంచి నీరు కారడం, ఒళ్లు నొప్పులు, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ విషయం ఏఎన్ఎం విజయలక్ష్మికి చెప్పగా వెంటనే విద్యార్థిని ఏఎన్ఎం రిమ్స్‌కు తీసుకెళ్లింది. రిమ్స్ ఓపీ విభాగంలో వైద్యులు మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. మధ్యాహ్నం విద్యార్థి బంధువు వచ్చి గ్రామానికి తీసుకెళ్లి నాటు వైద్యం చేయించారు. సాయంత్రానికి విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అ తరువాత కుటుంబ సభ్యులు రిమ్స్‌లో చేర్పించారు. ఈ విషయాన్ని ఎస్టీ గురుకులం ఆర్సీవో రాజలక్ష్మి ఎస్టీ గురుకులం ఉన్నత అధికారులకు చెప్పడంతో వారి సూచనల మేరకు బుధవారం విద్యార్థిని హైదరాబాద్‌కు తరలించారు.



హైదరాబాద్‌లో సినిమా ట్రైలర్‌ను విడుదల చేస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

# హరితహారం స్ఫూర్తితో సింబా!

- పర్యావరణ పరిరక్షణ కథాంశంతో సినిమా
- దర్శకుడు ఓదెలకు చెందిన సంపత్ నంది
- నిర్మాత జీలకుంటకు చెందిన దాసరి రాజేందర్‌రెడ్డి
- హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల

ఓదెల, జూలై 24: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన హరితహారం స్ఫూర్తితో.. పర్యావరణ పరిరక్షణ, వృక్షాల ప్రాధాన్యతను తెలియజేసేలా 'సింబా' సినిమాను తెరకెక్కించామని దర్శక, నిర్మాతలు తెలిపారు. ఈ సినిమాకు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని ఓదెలకు చెందిన సంపత్ నంది దర్శకుడుగా, జీలకుంటకు చెందిన దాసరి రాజేందర్‌రెడ్డి నిర్మాతలుగా వ్యవహరించారు. కమర్షియల్ చిత్రంగా కాకుండా వృక్షాల వల్ల కలిగే లాభాలు, భవిష్యత్‌లో ఆక్సిజన్‌కు పొంచి ఉన్న ముప్పును వివరిస్తూ ప్రజలను చైతన్య పరిచేలా సంపత్ నంది టీమ్ వర్క్స్, రాజ్ దాసరి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కించారు. ప్రముఖ తారాగణం జగపతిబాబు, కన్నడంలో ప్రముఖ హీరోగా పేరు తెచ్చుకున్న వశిష్ఠ సింహ, ఇతర సినీ నటులతో షూట్ చేశారు. మూవీకి కేసీఆర్ ప్రభుత్వం కూడా ఎంతో సహకారం అందించిందని దర్శక, నిర్మాతలు తెలియజేశారు. మూడేండ్ల క్రితమే షూటింగ్ పూర్తికాగా విడుదల ఆలస్యమైంది. బుధవారం హైదరాబాద్‌లో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు.

## 16 మంది ఎంపీలకు చీరలు


**బీఆర్ఎస్ సీనియర్ నేత బట్టు రాజశేఖర్ నిరసన**

ఇబ్రహీంపట్నం, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బీజేపీ మొండి చెయ్యి చూపడం సరికాదని, రాష్ట్రం నుంచి గెలిచిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారో చెప్పాలని జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బట్టు రాజశేఖర్ ప్రశ్నించారు. తెలంగాణ ఎంపీలు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ముందుకు వెళ్లాలని సూచించారు. బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా 'రాష్ట్రంలో మా పరిస్థితి ఇది' అని పేర్కొంటూ నిరసన తెలిపేందుకు చీర, గాజులు, నల్ల మాస్కులను కొరియర్ ద్వారా పంపుతున్నట్టు చెప్పారు. నిరసన తెలిపేందుకు బానిసత్వం అడ్డువస్తే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర, బిహార్ రాష్ట్రాల్లా తాము కూడా ప్రాంతీయ పార్టీ ఎంపీలను గెలిపించుకొని నిధులు తెచ్చుకుంటామని స్పష్టం చేశారు.బుధవారం ఆయన గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేకపోవడంపై రాష్ట్ర ఎంపీలు సిగ్గుపడాలని సూచించారు. ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రూ.15 వేల కోట్లు, బిహార్‌లోని నితీశ్ ప్రభుత్వం రూ.26 వేల కోట్లు తీసుకెళ్లిందని, తెలంగాణ నుంచి 17 మంది ఎంపీలుండి రాష్ట్రానికి రూపాయి కూడా తీసుకరాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీకి, బీజేపీ ఎంపీలు గుజరాత్‌కు బానిసలయ్యారని విమర్శించారు.

# కొత్త నేరచట్టాలను సమీక్షించాలి

- జడ్జిలు, న్యాయవాదుల సూచనలు స్వీకరించాలి
- బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్
- కేంద్ర న్యాయశాఖ మంత్రి మేఘ్వాల్‌కు వినతిపత్రం అందజేత

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): కొత్త నేర చట్టాలను సమీక్షించి సవరణలు తేవాలని, పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ నోటరీల నియామకాలను వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నేతృత్వంలో న్యాయవాద బృందం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా పలు విషయాలను ఆయన దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. కొత్త నేర చట్టాల్లో స్వల్ప సవరణల విషయమై జిల్లా జడ్జిలు, జిల్లా కోర్టుల ప్రాక్టీసింగ్ సీనియర్ న్యాయవాదుల సూచనలను స్వీకరించాలని కోరారు. 2021లో వచ్చిన సెంట్రల్ నోటరీస్ నోటిఫికేషన్‌లో 2,000 మంది న్యాయవాదులు దరఖాస్తు చేసుకున్నారని, వాటిని వెంటనే పరిశీలించి, వెంటనే నియామకాలు కేంద్ర మంత్రిని ఎంపీ వద్దిరాజు కోరారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును అమలు చేయాలని కోరారు. ఈ బృందంలో సీనియర్ న్యాయవాదులు తాళ్లూరి దిలీప్, నేరెళ్ల శ్రీనివాస్, సంక్రాంతి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తదితరులు